
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 22, మే, 2025



సులభంగా.. వేగంగా..
భూ భారతి చట్టం అమలుతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని రైతులు భావిస్తున్నారు. 8లో



ఆర్టిజన్లకు బదిలీల భయం
విద్యుత్ కర్మాగారాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల వారికి బదిలీలు జరగగా, ఆర్టిజన్లకూ స్థాన చలనం కలగనుందని సమాచారం. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32°/ 25°

వాతావరణం
జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం
శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి విశాఖపట్టణానికి చెందిన గవిరెడ్డి కస్తూరి నాయుడు దంపతులు రూ.1,00,016, కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం పైడికొండల పాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీయదత్త దంపతులు రూ.2.50 లక్షలు ఆలయ ఈఓ రమాదేవికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కలిసి నడిస్తేనే పార్టీ బలపడుతుంది

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

కొత్తగూడెంఅర్బన్: నాయకులు, కార్యకర్తలు అందరితో కలిసి నడిస్తేనే పార్టీ బలపడుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. కొత్తగూడెంలో బుధవారం జరిగిన పార్టీ సంస్థాగత సభకు జిల్లా అబ్జర్వర్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలు, ఏ, బీ బ్లాక్‌ల అధ్యక్ష పదవులకు ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 27 వరకు పరీక్షలు జరగనుండగా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆదివారంతో సహా ప్రతీ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం వారికి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయి. జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 7,635 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అధికారులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సమయానుకూలంగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచుతున్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

శ్రీరాముడి దర్శనం కోసం బుధవారం క్యూలైన్లలో ఉన్న హనుమాన్ మాలధారులు



భద్రాచలం.. కాషాయవర్ణం

భద్రగిరికి బారులుదీరిన హనుమాన్ మాలధారులు
- శ్రీరామనవమి తరహాలో పోటెత్తుతున్న భక్తులు
- అరకొర ఏర్పాట్లతో తప్పని తిప్పలు
- నేడు హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జై శ్రీరామ్ నామస్మరణలతో మార్మోగే భద్రగిరి వీధుల్లో ఇప్పుడు 'రామభక్త హనుమాన్‌కీ జై' నినాదాలు వినిపిస్తున్నాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తులు భద్రాచలం చేరుకుంటున్నారు. దీంతో పట్టణం, ఆలయ ప్రాంగణం, గోదావరి తీరం కాషాయవర్ణాన్ని సంతరించుకుంటున్నాయి.

వేలాదిగా భక్తులు..
భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం వందల ఏళ్లుగా అంగరంగ వైభవంగా సాగుతూ వస్తోంది. అలాగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, ఆ ముందురోజు తెప్పోత్సవం సైతం కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఈ రెండు వేడుకలను కనులారా చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు భద్రాచలం చేరుకుంటారు. వారి కోసం ఇటు దేవస్థానం అటు జిల్లా/రాష్ట్ర యంత్రాంగం తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. చలువ పందిళ్లు, షామియానాలు, తాగునీటి సౌకర్యం, ప్రత్యేక క్యూలైన్లు వంటివి సమకూరుస్తారు. అయితే దశాబ్ద కాలంగా హనుమాన్ జయంతి సందర్భంగా కూడా భద్రాచలానికి భక్తుల తాకిడి పెరుగుతోంది.

అంజన్న భక్తులకు సవాలే..
సాధారణంగా శ్రీరామనవమి మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో వస్తుంది. ఆ సమయంలో ఉండే ఎండలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో ప్రధాన రహదారి నుంచి ఆలయ ప్రాంగణం వరకు చలువ పందిళ్లు వేస్తారు. మార్గమధ్యంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు కూడా ఉంచుతారు. దేవస్థానం, జిల్లా అధికారులకు తోడు ఉడతా భక్తిగా స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు సైతం అన్నదానం, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాయి. కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ఈ ఏర్పాట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే శ్రీరామనవమి, ముక్కోటి పండుగల తరహాలోనే హనుమాన్ జయంతికి కూడా వేలాది మంది వస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఏర్పాట్లు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మాల ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా, నియమ నిష్ఠలతో ఆహారం తీసుకునే భక్తులు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకుని గోదావరిలో స్నానమాచరించి మాల విరమణ చేయడం సవాళ్లతో కూడుకున్న వ్యవహారంగా మారుతోంది.

శబరిమల తరహాలో..
అయ్యప్ప భక్తులు మాల విరమణ కోసం శబరిమల వెళ్తున్నట్టుగానే హనుమాన్ మాల ధరించిన భక్తుల్లో అనేక మంది జగిత్యాల జిల్లా కొండగట్టు, భద్రాచలం రావడాన్ని ఆనవాయితీగా పెట్టుకుంటున్నారు. అందువల్లే ప్రతీ ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని హనుమాన్ జయంతికి భక్తులు ఇబ్బంది పడకుండా డార్మిటరీలు, తాగునీరు వంటి అదనపు సౌకర్యాలు, మాల విరమణకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు, భజన మందిరం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. శ్రీరామనవమి తరహాలోనే ఈ ఏర్పాట్లపై మంత్రుల స్థాయిలో సమీక్ష జరపాలని అంటున్నారు.

ప్రణాళిక అవసరం..
ముక్కోటి, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రుల స్థాయిలో ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేస్తారు. జరుగుతున్న పనులపై ప్రతీ రెండు వారాలకు ఓసారి సమీక్ష నిర్వహిస్తారు. అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేస్తూ భక్తులకు ఇబ్బంది రాకుండా చూస్తారు. కానీ వేలాది మంది వచ్చే హనుమాన్ జయంతి పర్వదినం రోజున ప్రత్యేక ఏర్పాట్లపై ఇటు ఆలయ, అటు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించడం లేదు. కేవలం అదనపు క్యూ లైన్లు, ప్రసాదం కౌంటర్ల ఏర్పాట్లతోనే సరిపెడుతున్నారు. హనుమాన్ జయంతికి వచ్చే భక్తులు ఇక్కడ బస చేయరు.. ఇలా వచ్చి అలా వెళ్లిపోతారనే అభిప్రాయం ఉండడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది.



భూ సేకరణ వేగవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీతారామ కెనాల్ ఎత్తిపోతల పథకానికి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన ఇరిగేషన్, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో గ్రామసభల నిర్వహణ పూర్తి చేయాలని చెప్పారు. కాల్వల ఏర్పాటుతో రైతులకు భూమి విలువ పెరుగుతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్ల సమన్వయంతో భూసేకరణ చేయాలని సూచించారు. సర్వేయర్లకు అధునాతన యంత్రపరికరాలు, ల్యాప్‌టాప్‌లు అందజేస్తామని తెలిపారు. సర్వేలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని, తద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువులు, కాల్వల వెంట సుబాబుల్, తంగేడు, తాటి మొక్కలు నాటేలా అవగాహనా కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కాశయ్య, సుమ, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈలు అర్జునరావు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చుంచుపల్లి : వెంకటేశ్వర కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి
చుంచుపల్లి: మండలంలోని రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీల సమగ్రాభివృద్ధికి శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఈ రెండు గ్రామాల్లో పర్యటించారు. డ్రెయినేజీలు, రహదారులు, ఖాళీ స్థలాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రెండు గ్రామాల అభివృద్ధికి నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉన్నామని, వసతుల కల్పనకు తక్షణమే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల్లో ఈ గ్రామాలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సుభాషిని, ఎంపీఓ సత్యనారాయణ, స్థానిక నాయకులు జేబీ శౌరి, దుర్గేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం

సుజాతనగర్: క్రీడలతో ఆనందంతో పాటు ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. వేపలగడ్డలో నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో బ్యాడ్మింటన్ స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా బ్యాడ్మింటన్ ఆటపై మక్కువ పెరుగుతుందని అన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధనే ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, స్టేడియం నిర్వాహకులు చెరుకుమల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్ : బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే కూనంనేని

ముందుగానే తొలకరి..

- ఉపరితల ఆవర్తనంతో వర్షాలు
- వారంలోగా రుతుపవనాలు వస్తాయంటున్న వాతావరణ శాఖ
- వానాకాలం పంటల సాగుకు రైతుల సమాయత్తం

బూర్గంపాడు: ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరిస్తోంది. మే నెలలో కురిసిన అకాల వర్షాలతో భూములు పదునయ్యాయి. గత మూడు రోజులుగా ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు కూడా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుంది. ఈ కార్తెలో సాధారణంగా ఎండల తీవ్రత పెరుగుతుంది. అయితే ఉపరితల ద్రోణి ప్రభావం, రుతుపవనాలు ముందస్తుగా వస్తాయనే సమాచారంతో ఈ ఏడాది ముందుగానే పంటలు సాగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

పదునెక్కిన భూములు..
ఇటీవలి వర్షాలతో భూములు పదునెక్కగా వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచే పత్తితో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, పిల్లి పెసర, పెసర పంటలు కూడా సాగు చేస్తారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో జూన్ రెండో వారంలో వరి నార్లు పోస్తారు. వర్షాలు కురుస్తుండడం, రుతుపవనాలు ముందుగానే వస్తాయనే వాతావరణశాఖ సూచనలతో పంటల సాగు పనులు ప్రారంభించారు. గత సీజన్‌లో సాగు చేసిన పత్తి, మిరప వ్యర్థాలను తొలగించి భూములు శుభ్రం చేస్తున్నారు. వరి మాగాణుల గట్లు సరిచేసుకుంటున్నారు. పశువుల ఎరువు, చెరువు మట్టిని పొలాల్లో తోలుకుంటున్నారు. చేలలో నీటి గుంతలు, పంట కాల్వలు తవ్వుతున్నారు. మరోవైపున పెట్టుబడి ఖర్చులకు డబ్బులు సమకూర్చుకుంటున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలను వేసుకుంటున్నారు. ఏ భూముల్లో ఏ విత్తనాలు వేయాలి, ఏ కంపెనీ విత్తనాలు తీసుకోవాలనే చర్చ రైతుల్లో సాగుతోంది. మరో వారం రోజుల్లో సాగు పనులు ముమ్మరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



బూర్గంపాడులో దుక్కి దున్నుతున్న రైతు

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

ఉద్యాన శాఖాధికారి కిశోర్‌కుమార్

టేకులపల్లి : పామాయిల్ సాగుతో అనేక లాభాలు ఉన్నాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి జె.కిశోర్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ జి.లాల్‌చంద్ అన్నారు. మండలంలోని చింతోనిచెలకలో ఉద్యాన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎకరానికి 57 పామాయిల్ మొక్కలు వేయాలని, డ్రిప్ పరికరాల కోసం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తామని చెప్పారు. మూడేళ్లపాటు ఎకరానికి రూ.4200 చొప్పున రైతుల ఖాతాలల్ల జమ చేస్తామన్నారు. పామాయిల్ గెలలు 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తాయని, నికర ఆదాయం ఉంటుందని వివరించారు. పామాయిల్‌లో అంతర పంటగా మునగ సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణ, హెచ్‌ఓ స్రవంతి, ఏఈఓ రెహనా, ఇరిగేషన్ మేనేజర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

విద్యారంగ అభివృద్ధికి తోడ్పడాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాల పెంపుదలతో పాటు విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరాచారి అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో హెచ్‌ఎంలకు జరుగుతున్న వృత్యంతర శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యారంగ డిజిటలీకరణ వైపుగా రాష్ట్రం ముందుకు సాగుతోందని, మార్పులను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుని నాయకత్వ పటిమతో పని చేయాలని సూచించారు. ఐదు రోజుల శిక్షణలో రిసోర్స్ పర్సన్లు చెప్పే అంశాలను శ్రద్ధగా విని నోట్స్ రాసుకోవాలని, పాఠశాలకు వెళ్లిన తర్వాత వాటిని సరైన రీతిలో ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర సమన్వయకర్త, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, రిసోర్స్‌పర్సన్లు ఆనందకుమార్, మీరా సాహెబ్, విజయబాబు, బాబూలాల్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం..
2025 – 26 విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థుల చేతుల్లో పాఠ్యపుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ తెలిపారు. పాఠశాలలకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాకు 5,08,400 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 4,01,875 పుస్తకాలు వచ్చాయని వివరించారు.



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ఎస్పీ రోహిత్ రాజు

చుంచుపల్లి: ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. బుధవారం ఆయన చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో–ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలు, వాటి పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, ఎస్సై ఉమ తదితరులు పాల్గొన్నారు.



కేసుల వివరాలపై ఆరా తీస్తున్న రోహిత్‌రాజు

ఆయుర్వేదం.. అందని వైద్యం

- బాధితులకు సకాలంలో అందని మందులు
- వారంలో మూడు రోజులే వస్తున్న డాక్టర్లు
- జిల్లాలో 12 వైద్యశాలలు, వెల్‌నెస్ సెంటర్లు
- అంతటా ఇదే పరిస్థితి..

ఇల్లెందు: ఆధునిక వైద్య రంగం ఎంత అభివృద్ధి చెందినా నేటికీ కొందరు ఆయుర్వేద, యునానీ, హోమియో మందులపైనే ఆధారపడుతున్నారు. అయితే సిబ్బంది కొరత, ఉన్నవారూ అంతంతమాత్రంగానే పని చేస్తుండడంతో బాధితులకు సకాలంలో మందులు అందడం లేదు. జిల్లాలో 12 ఆయుర్వేద, యునానీ, హోమియో ఆస్పత్రులు ఉండగా, డాక్టర్లు వారంలో మూడు రోజులే వైద్యశాలలకు వస్తుంటారు. అప్పుడు కూడా పేషెంట్లకు సరైన చికిత్స అందడం లేదు.

ఎస్‌ఎన్‌ఓలే దిక్కు..
జిల్లాలో 12 ఆస్పత్రులకు అనుబంధంగా వెల్‌నెస్ సెంటర్లు నెలకొల్పారు. ఈ వైద్యశాలల్లో నలుగురే డాక్టర్లు ఉన్నారు. వీరంతా ప్రతీ గురు, శుక్ర, శనివారాల్లో మాత్రమే వస్తుంటారు. అతి తక్కువ మంది ఉన్న ఫార్మసిస్టులు, స్వీపర్ కం నర్సింగ్ ఆర్డర్లీ(ఎస్‌ఎన్‌ఓ)లు మాత్రమే బాధితులకు మందులు ఇస్తుంటారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన డీపీఎంలను నియమించినా వారూ అంతంతమాత్రంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్నిచోట్ల ఆస్పత్రుల తాళాలు తీసే దిక్కే లేదు.

లోపాలు అనేకం..
తెలంగాణ ఏర్పాటు తర్వాత పాలన వికేంద్రీకరణపై మొగ్గు చూపిన ప్రభుత్వం.. ఆయుర్వేద, యునానీ, హోమియో వైద్యశాలలను మాత్రం విస్మరించింది. వీటికి జిల్లా స్థాయిలో అధికారులు లేరు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు వరంగల్ కేంద్రంగా రీజినల్ డైరెక్టర్(ఆర్‌డీ) పర్యవేక్షిస్తున్నారు. అలా కాకుండా ప్రతీ జిల్లాకు పాలనాపరంగా అధికారిని నియమించడంతో పాటు సిబ్బంది సంఖ్య పెంచాలని, నిత్యం ప్రజలకు వైద్యసేవలు, మందులు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

'ఇల్‌నెస్' సెంటర్లుగా..
జిల్లాలో 12 ఆయుర్వేద, హోమియో, యునానీ వైద్యశాలలకు అనుబంధంగా వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసినా వాటిని తెరిచే నాథుడు లేక అవి ఇల్‌నెస్ సెంటర్లుగా మారాయి. జిల్లాలో రొంపేడు, కొత్తగూడెం, భద్రాచలం, అశ్వాపురం, కరకగూడెం, నాగుపల్లిలో ఆయుర్వేద ఆస్పత్రులు, ఇల్లెందు, అశ్వారావుపేట, ఆర్ కొత్తగూడెంలో హోమియో, భద్రాచలం, పాపకొల్లులో యునానీ ఆస్పత్రులు ఉండగా అన్నింటికీ కలిపి నలుగురే డాక్టర్లు ఉన్నారు. ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి





తలుపులు తెరుచుకోని ఇల్లెందు వెల్‌నెస్ సెంటర్ (ఇన్‌సెట్) ప్రభుత్వ హోమియో వైద్యశాల ఇదే

తీవ్రంగా మందుల కొరత..
జిల్లా వ్యాప్తంగా తక్కువ ఖర్చుతో ఆయుర్వేద వైద్యం పొందే మార్గం ఉన్నా అటు డాక్టర్లు, ఇటు మందులు అందుబాటులో లేక ప్రజల్లో ఆదరణ తగ్గింది. కొందరు ఆయుర్వేద వైద్యం, మందులపై నమ్మకంతో ఆస్పత్రికి వస్తున్నా వారికి సకాలంలో చికిత్స అందకపోగా మందుల కొరతా వేధిస్తోంది. డాక్టర్లు లేకపోవడంతో మందులకు ఇండెంట్ పెట్టే వారు కూడా ఉండడం లేదు.

ఆస్పత్రిని అందుబాటులో ఉంచాలి..
ఇల్లెందులోని హోమియో వైద్యశాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రెగ్యులర్ డాక్టర్, ఫార్మసిస్ట్, స్వీపర్‌ను నియమించాలి. సరిపడా మందులు నిల్వ ఉంచాలి. అధిరారుల పర్యవేక్షణ నిరంతరం ఉండేలా చూడాలి.
– మునిగంటి శివ, ఇల్లెందు

ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నా
ఇల్లెందు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో గత కొంత కాలంగా ఇన్‌చార్జ్‌గా సేవలు అందిస్తున్నా. గార్లలో రెగ్యులర్ డాక్టర్‌గా రెండు చోట్లా పని చేయడంతో వారానికి మూడు రోజులే రావాల్సి వస్తోంది. త్వరలో డాక్టర్ పోస్టులు భర్తీ అవుతాయి. కొన్ని రకాల మందులు తక్కువ ఉన్నాయి.
– డాక్టర్ జ్యోతి, ప్రభుత్వ హోమియో వైద్యశాల, ఇల్లెందు

క్లుప్తంగా

డయాగ్నస్టిక్ సెంటర్ సీజ్



ఎస్వీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ రక్త పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, డీఈఎంఓ డాక్టర్ ఫయాజ్ మోహినుద్దీన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి నిర్వహిస్తున్న ఎస్వీ డయాగస్టిక్ సెంటర్‌ను సీజ్ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ శ్రీనివాస్ లీలా, ఎండీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు

'సీతారామ' భూసేకరణకు గ్రామసభలు

అశ్వారావుపేటరూరల్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్యాకేజీ నంబరు–7, 8వ డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణాల కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం, నారంవారిగూడెం,అశ్వారావుపేట, జమ్మిగూడెం, మద్దికొండ, 23న ఆసుపాక, వేదాంతపురం, తిరుమలకుంట, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, గ్రామ పంచాయతీ కార్యాలయం, 24న రామన్నగూడెం, అనంతారం, కన్నాయిగూడెం, నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని తెలిపారు. సభల్లో మొత్తం 848.28 ఎకరాల భూసేకరణకు సంబంధించి ఆయా రైతులతోపాటు, పీసా గ్రామసభలకు కార్యదర్శులు, పీసా కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, గ్రామపెద్దలు హాజరు కావాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో పది మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బుధవారం తీర్పుచెప్పారు. కొత్తగూడెం వన్ టౌన్ పరిధి, లక్ష్మీదేవిపల్లి ఏరియా, పాల్వంచ ఏరియాలలో పోలీసులు తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మందిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. దీంతో న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు.

టీజీఆర్‌జేసీలో చాణక్యకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్



చాణక్య అభినవ

చుంచుపల్లి/సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించిన టీజీఆర్‌జేసీ పరీక్షలో రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బొమ్మిశెట్టి చాణక్య అభినవ ఎంఈసీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. కాగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ర్యాంకు సాధించినట్లు విద్యార్థి చాణక్య తెలిపాడు.

పీవీకే–5 గనిలో గ్యాస్ లీక్

గోడలు నిర్మించటంతో తప్పిన ప్రమాదం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్లైన్ గనిలో మంగళవారం 16 రేస్ 72 లెవల్ వద్ద గ్యాస్ విడుదలగా, విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గనిలో గ్యాస్‌ను గుర్తించే మానిటరింగ్ సిబ్బంది ఈ విషయాన్ని గమనించి గని మేనేజర్ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు అప్రమత్తమై రెండు రోజులుగా గ్యాస్‌లీకేజీ అవుతున్న ఏరియాలో గోడలు నిర్మించి గ్యాస్ లీకేజీని అరికట్టారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ విషయమై గని మేనేజర్‌ను వివరణ కోరగా.. పాత గని కావడంతో జియాలజికల్ సమస్యలు తలెత్తాయని, భయపడాల్సిన పనిలేదని చెప్పుకొచ్చారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వర్తక సంఘం భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో గాంధీనగర్, శ్రీనగర్ ఏరియాల నుంచి కేతిని కుమారి, ఎర్రంశెట్టి రాజేశ్వర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలోనాయకులు రాపాకరమేష్, క్లైంవిజయరెడ్డి,భూక్య రవి, వెంకటేశ్వరరావు, రంజిత్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

సులభంగా.. వేగంగా..

- భూ భారతి చట్టంతో సమస్యలకు పరిష్కారం
- పైలట్ ప్రాజెక్ట్‌గా సుజాతనగర్ మండలం ఎంపిక
- రెవెన్యూ సదస్సుల్లో 2,835 దరఖాస్తులు..



రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్ (ఫైల్)

సుజాతనగర్: భూ భారతి చట్టం అమలుకు జిల్లాలో సుజాతనగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా, రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన లభించింది. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు భావిస్తున్నారు. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు సులభతరం చేయడంతోపాటు తహసీల్దార్, ఆర్డీఓలకు అధికారాలు కల్పించడంతో సమస్యలు వేగవంతంగా పరిష్కారం కానున్నాయి. సుజాతనగర్ మండలంలో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా సదస్సుల్లో భూ సమస్యలపై 2,835 దరఖాస్తులు అధికారులకు అందాయి. సాదాబైనామా, అసైన్డ్ భూములు, పాసు పుస్తకాల జారీ, పోడు భూములు, గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయడం వంటి సమస్యలపై పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అర్జీలను ఆన్‌లైన్‌చేసి, విచారణ త్వరితగతిన పూర్తిచేసి పరిష్కరించనున్నట్లు తెలుస్తోంది.

సాదాబైనామా అర్జీలే ఎక్కువ..

మొత్తం 2,835 దరఖాస్తుల్లో సాదాబైనామా 1,240, వారసత్వం 118, ఫామ్ కే 103, పెండింగ్ మ్యుటేషన్ 3, పాసు పుస్తకాలపై 314, డీఎస్ పెండింగ్ 12 దరఖాస్తులతోపాటు, పోడు భూములు, అసైన్డ్ ల్యాండ్ అన్యాక్రాంతం, ఇతరత్రా కోర్టు కేసులకు సంబందించిన దరఖాస్తులు కూడా వచ్చాయి. వీటిలో ప్రస్తుతం వారసత్వం భూములు, గిరిజనులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించనున్నారు. డిప్యూటీ తహసీల్దార్, గిర్దావర్, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్లతో మూడు బృందాలుగా అధికారులు ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి భౌగోళిక హద్దులను ఏర్పాటు చేయనున్నారు.

రైతులకు ప్రయోజనం

ధరణి పోర్టల్ అమల్లో ఉన్నప్పుడు సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ప్రతీ సమస్య సీసీఎల్‌ఏ వరకు వెళ్లే పరిస్థితి ఉండేది. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదు. దీంతో రైతులు చేసేదేమి లేక ఇబ్బందులకు గురయ్యారు. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి చట్టంతో సులభంగా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉండటంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కాగా త్వరలోనే జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

సుజాతనగర్ మండల స్వరూపం

విస్తీర్ణం	24,927.18 ఎకరాలు
అటవీ భూమి	7,535.25ఎకరాలు
అసైన్డ్ ల్యాండ్	558.13 ఎకరాలు
ప్రభుత్వ భూమి	2,241.28 ఎకరాలు
రెవెన్యూ గ్రామాలు	6
గ్రామ పంచాయతీలు	20

పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేశా..



మా తాత కాకటి పుల్లయ్య ద్వా రా మా నాన్న వెంకయ్యకు వా రసత్వంగా 444 సర్వే నంబర్‌లో 2 ఎకరాల భూమి వచ్చింది. ఈ భూమిని గత 50 ఏళ్లుగా మా నాన్నే సాగు చేస్తున్నాడు. పాసు పుస్తకం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు పొందలేకపోతున్నాం. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాస్ బుక్ కోసం దరఖాస్తు చేశాను. –కాకటి సునీల్ కుమార్, సింగభూపాలెం

సమస్యలకు పరిష్కారం



మండలంలో మొత్తం 2,835 దరఖాస్తులు రాగా, మూడు బృందాలుగా దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. వారసత్వం, గిరిజనులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్న భూ సమస్యలకు ప్రస్తుతం పరిష్కారం లభించనుంది. ప్రభుత్వ అనుమతి అనంతరం సాదాబైనామా దరఖాస్తులను విచారిస్తాం.
–వనం కృష్ణప్రసాద్, తహసీల్దార్, సుజాతనగర్

ఆర్టిజన్లకు బదిలీల భయం

- కేటీపీఎస్‌లో అరకొర వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు
- పర్మనెంట్ చేశాకే బదిలీ చేయాలని డిమాండ్



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు బదిలీల భయం పట్టుకుంది. ఇప్పటికే టీజీ జెన్‌కో పరిధిలోని పలు కర్మాగారాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాలతోపాటు, ఏఈ నుంచి ఎస్ఈ వరకు బదిలీలు జరిగాయి. కొత్తగా ఏర్పాటైన వైటీపీఎస్, బీటీపీఎస్‌లలో ఉద్యోగ, కార్మికులు అవసరం ఉండటంతో అక్కడికే ఎక్కువ మందిని బదిలీలు చేశారు. ఈ క్రమంలో కేటీపీఎస్‌లో అదనంగా ఉన్న ఆర్టిజన్లకు సైతం స్థానచలనం కలిగించాలని యాజమాన్యం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బదిలీలు సరికాదంటున్న కార్మికులు

ఆర్టిజన్ కార్మికులు గ్రేడ్–1, 2 ,3, 4లుగా ఉన్నారు. స్కిల్ ఆధారంగా రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. వీరు గతంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసిన క్రమంలో స్కిల్‌ను బట్టి ఆయా కంపెనీలు పనికి తగిన వేతనం ఇచ్చేవి. గత ప్రభుత్వం వీరిని ఆర్టిజన్‌లుగా తీసుకోవడం, కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. తర్వాత కాలంలో పర్మనెంట్ ఉద్యోగులుగా తీసుకుంటారనే ఆశలో ఆర్టిజన్లు ఉన్నారు. కానీ పదేళ్లు గడుస్తున్నా ఉద్యోగుల మాదిరిగా వీరికి జెన్‌కో యాజమాన్యం సౌకర్యాలు కల్పించడంలేదు. పైగా అదనంగా ఉన్నారనే నెపంతో యాజమాన్యం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలనే యోచన సరికాదనే భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నామని ఆర్టిజన్లు వాపోతున్నారు.

ఉద్యోగులుగా తీసుకోవాలి

ఇప్పటివరకు ఇతర కేడర్లలో అత్యధికంగా పదోన్నతులతోనే బదిలీలు చేపట్టారు. ఆర్టిజన్లు కేటీపీఎస్ 7వ దశలో 600 మంది, కేటీపీఎస్ 5,6 దశల్లో సుమారు 1,400 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. విద్యుత్ సంస్థలన్నింటిలో కలిపి సుమారు 24 వేల మంది ఉన్నారు. బదిలీ చేసే ముందు తమను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నీ తమకు కల్పించాలని ఆర్టిజన్లు కోరుతున్నారు. లేనిపక్షంలో బదిలీ యోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ములకలపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు ఇవ్వాలని తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని మాదారం గ్రామంలో తెలంగాణా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మండల సదస్సులో మాట్లాడారు. సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య, తెలంగాణా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ ములకలపల్లి, పాల్వంచ మండలాల కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, పాకాల వెంకట్రావు, ఊకంటి రవికుమార్, మాలోతు రావూజా, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు

రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన అంకంపాలెం విద్యార్థినులు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

దమ్మపేట: పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన దమ్మపేట మండలానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ధనసరి సీతక్క, శాఖ కార్యదర్శి శరత్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కొమురం భీమ్ భవన్‌లో గిరి జన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అకాడమిక్ సక్సెస్ మీట్(2024–25)ను ఘనంగా నిర్వహించారు. 575, 569 మార్కులతో గిరిజన ఆశ్రమ పాఠశాల పరిధిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వాడే మౌనిక, స్రవంతిలకు గోల్డ్ మెడళ్లను అందజేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలను కూడా మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు. ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్‌ఎంలు శారద, చంద్రకళ, వార్డెన్ నాగమణి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన బుధవారం పరిశీలించారు. సులానగర్‌లో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన ఫారమ్ పాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఉపాధి కూలీలకు పనిముట్లు అందజేస్తామన్నారు. నర్సరీల్లో మొక్కలను షిఫ్టింగ్, గ్రేడింగ్ చేయించాలని చెప్పారు. కోయగూడెంలో సాగు చేస్తున్న మునగ తోటను పరిశీలించి, రైతుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. నర్సరీలు, పార్కులు, విద్యాసంస్థల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని, బోరు బావి ఉన్న రైతులతో ఫారమ్ పాండ్లు నిర్మింపజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు పవిత్ర, కవిత, కృష్ణ చైతన్య, సంజీవ్, ఈజీఎస్ సిబ్బంది ఈశ్వరి, చంద్మల్, సత్యనారాయణ, లకన్, పూర్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సిద్ధం చేయాలి

పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఓ విద్యాచందన అధికారులను ఆదేశించారు. బుధవారం మండలం పరిధిలోని ఆంజనేయపాలెం స్టిచ్చింగ్ సెంటర్‌ను సందర్శించి దుస్తులను పరిశీలించారు. జూన్ 2న అన్ని పాఠశాలలకు యూనిఫామ్ అందజేయాలని సూచించారు. ఏపీఎం రవికుమార్, సీసీ నాగమణి, నాగేశ్వరరావు, శిరీష, వీరలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

గంజాయి సీజ్

ఖమ్మంక్రైం: జిల్లా మీదుగా తరలిస్తున్న రూ.12లక్షల విలువైన గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుండి పూణేకు గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఖమ్మం బైపాస్ రోడ్డులో బుధవారం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులను పూణేకు చెందిన ఫిరోజ్ అజీజ్, ప్రదీప్ గైక్వాడ్‌గా గుర్తించగా, 20.735 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్, ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ కృష్ణ, ఎస్సైలు రేష్మ, శ్రీహరిరావు, ఉద్యోగులు కరీం, స్వరూప, సుధీర్, వెంకట్, హరీష్, హనుమత్, విజయ్ పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

పాల్వంచ: వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడు, టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్ నాగరాజును పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సుజాతనగర్ మండల కేంద్రానికి చెందిన బత్తుల వీరయ్య భార్య త్రివేణి(32)ని మరిది కానిస్టేబుల్ నాగరాజు వేధింపులకు గురిచేయడంతో తీవ్ర మనస్తాపం చెందింది. పాల్వంచలోని వికలాంగుల కాలనీలో నివాసం ఉంటున్న తండ్రి శివ ఇంటికి వచ్చి సోమవారం చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు త్రివేణి ఆత్మహత్యకు కారణమైన మరిదిని అరెస్ట్ చేశారు.

పశువులు స్వాధీనం



పోలీసులు పట్టుకున్న పశువుల వాహనం

టేకులపల్లి: టేకులపల్లి నుంచి పండితాపురం సంతకు అక్రమంగా తరలిస్తున్న పశువులను బుధవారం టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. తావుర్యా తండా పంచాయతీ ఈర్యా తండా వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు బొలెరో ట్రాలీలో తరలిస్తున్న ఏడు పశువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మునీర్, తేజావత్ ప్రసాద్, హైమద్‌లను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించామని ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

తారుప్లాంట్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఉన్న తారుప్లాంట్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తారు ప్లాంట్ నుంచి దట్టమైన పొగతో మంటలు వ్యాపించటంతో ఆ ప్రాంతమంతా చీకటిగా మారింది. జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. ప్లాంట్‌లో పనిచేసే కార్మికుల సమాచారంతో భద్రాచలం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. భద్రాచలం ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫైర్‌మెన్లు కిరణ్, యాకుబ్, వెంకట్రామిరెడ్డి మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

సదస్సులు లేవు.. చైతన్యం లేదు..



ట్రాక్టర్‌తో పొలం దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

- ఊసే లేని 'మన తెలంగాణ– మన వ్యవసాయం'
- రెండేళ్ల క్రితం వరకు ఏప్రిల్, మేలో అవగాహన సదస్సులు
- ఈసారి మండలానికొక సదస్సుతో సరి

వైరారూరల్: పంటల సాగులో అవలంబించాల్సిన విధానాలు, విత్తనాల ఎంపిక జాగ్రత్తలు, సాగుకు ముందు చేయించాల్సిన భూపరీక్షలు ఇలా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు రైతు చైతన్య యాత్రలు నిర్వహించేవారు. తెలంగాణ ఏర్పడాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన తెలంగాణ – మన వ్యవసాయం' పేరుతో రైతు సమన్వయ సమితి సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఏటా వానాకాలం సాగుకు ముందు ఏప్రిల్, మే నెలల్లో అవగాహన సదస్సులను నిర్వహించేది. కానీ గత రెండేళ్ల నుండి 'మన తెలంగాణ – మన వ్యవసాయం' ఏటా సదస్సుల ఊసెత్తడం లేదు. దీంతోఆధునిక విధానాలపై అవగాహన లేక, ఏళ్లుగా ఒకే పంట సాగు చేస్తూ, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతూ రైతులు నష్టపోవడం అనవాయితీగా మారింది.

అవగాహనలేమితో నష్టాలు

గ్రామాల వారీగా రైతుల వద్దకు వెళ్లి సాగులో మెళకువలపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అంతేకాక నష్టాలు తగ్గే అవకాశముంది. గతంలో సదస్సులు నిర్వహించినప్పుడు వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి వివిధ అంశాలపై అవగాహన కల్పించడమే కాక రైతుల నుంచి సంతకాలు సేకరించేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు సమన్వయ సమితిల జాడ లేకపోగా, అవగాహన సదస్సుల విషయాన్నే మరిచిపోయారు. ఈ ఏడాది 'రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' పేరిట సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ నిర్దేశిత ప్రాంతాల్లోనే ఏర్పాటుచేస్తుండడంతో రైతులకు సలహాలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అవగాహన కల్పించాలి..



రైతు చైతన్య యాత్రలు నిర్వహించకపోవడంతో అన్నదాతలకు అవగాహన లేక నష్టపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చైతన్య సదస్సులు ఏర్పాటుచేయాలి. సేంద్రియ వ్యవసాయంపైనా అవగాహన కల్పిస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది.
– యమాల గోపాలరావు, సీపీఐ నాయకుడు

అమలు చేయాలి..



సాగుకు ముందు పంటలు, విత్తనాల రకాలపై అవగాహన లేకుండా పోయింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి గతంలో మాదిరి చైతన్యయాత్రలను నిర్వహించి భూసార పరీక్షలు, ఇతరఅంశాలపై వివరించాలి. దీంతో మాలాంటి రైతులకుమేలు జరుగుతుంది. – అయినాల కనకరత్నం, రైతు, కేజీ సిరిపురం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పద్దం చిన్న నరసింహారావు(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ బాదావత్ రవి కథనం ప్రకారం.. గుండెపుడి గ్రామ పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన పద్దం చిన్న నరసింహారావు(35), కల్తి కార్తీక్‌లు బైక్‌పై మంగళవారం రాత్రి జూలూరుపాడు వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా గుండెపుడి ఆర్కే ఫంక్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై అడ్డుగా వచ్చిన గేదెలను బైక్ ఢీకొట్టింది. దీంతో పద్దం చిన్న నరసింహారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు గాయాలయ్యాయి. బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో ఎస్‌అండ్‌పీ గార్డు..



రాజ్‌కుమార్(ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని స్టట్‌ఫిట్ బస్తీకి చెందిన సింగరేణి సెక్యూరిటీ గార్డు బి.రాజ్‌కుమార్(40) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం విధుల నిమిత్తం ఆఫీస్‌కు వెళ్లిన ఆయనకు చెమటలు వచ్చి అస్వస్థత చెందడంతో సింగరేణి ఆస్పత్రికి వెళ్లాలని తోటి సిబ్బంది సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తానని చెప్పి ఇంటికి వెళ్లాడు. ఇంటికి చేరిన కొద్ది సమయానికే మృతి చెందాడు. సహచర గార్డులు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కర్ణాటకలో చోరీ.. వైరాలో రికవరీ



కారు, బంగారాన్ని అప్పగిస్తున్న సీఐ సాగర్

వైరా: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన చోరీకి సంబంధించి నిందితుడు వైరాలో పట్టుబడగా సొత్తు రికవరీ చేసి అక్కడి పోలీసులకు అప్పగించారు. ఈఏడాది ఫిబ్రవరి 12వ తేదీన వైరా లీలా సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇక్కడ దొంగతనం చేసిన వారే అదే నెల 22 తేదీన కర్ణాటక రాష్ట్రంలోని చల్లికెరే పోలీస్ స్టేషన్ పరిధిలోనూ చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు వైరా సీఐ నూనావత్ సాగర్‌నాయక్ ఆధ్వర్యాన చేపట్టిన విచారణలో నిందితులు పట్టుబడగా వారి నుంచి బంగారాన్ని రికవరీ చేశారు. అందులో కర్ణాటకలో నమోదైన కేసుకు సంబంధించి 12తులాల బంగారు ఆభరణాలు, కారును చొల్లకిలే ఏఎస్‌ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ వసంత్‌కుమార్‌కు వైరాలో సీఐ సాగర్ బుధవారం అందజేశారు.